సాక్షి
వికారాబాద్

శనివారం । 25 । జనవరి । 2025



అభివృద్ధికి పెద్దపీట

తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 10లో ▸



వెండి పట్టీలు చోరీ

తాండూరు పట్టణంలోని ఓ నగల దుకాణానికి వచ్చిన ఇద్దరు మహిళలు వెండి పట్టీలు అపహరిస్తూ పట్టుబడ్డారు. 10లో ▸



గ్రామ సభలతో లబ్ధి

ప్రజాపాలన గ్రామ సభలతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ వెంకన్న గౌడ్ అన్నారు. 11లో ▸

న్యూస్‌రీల్

నేడు మోమిన్‌పేటలో స్పీకర్ పర్యటన

మోమిన్‌పేట: మండలంలో శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ తెలిపారు. మోమిన్‌పేటలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్నారు. పీఏసీఎస్ నూతన భవనం, గోదాంను ప్రారంభిస్తారని చెప్పారు. మండలంలోని చక్రంపల్లి, మల్లారెడ్డి గూడెం గ్రామాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనునట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని స్పీకర్ పర్యటనను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవలపై ప్రచారం

కొడంగల్: ఆర్టీసీ లాజిస్టిక్ డోర్ డెలివరీ ప్రక్రియ ప్రచారం శుక్రవారం పట్టణంలో జోరుగా సాగింది. తెలంగాణ ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్, రంగారెడ్డి రీజియన్ మార్కెటింగ్ బృందం విశ్వనాథ్ గౌడ్, చంద్రయ్య, కొడంగల్ లాజిస్టిక్ ఏజెంట్ బొంకురు నరేష్‌కుమార్ పట్టణంలోని దుకాణాల వద్దకు వెళ్లి లాజిస్టిక్ సేవల గురించి వివరించారు. డోర్ డెలివరీ కరపత్రాలు పంపిణీ చేశారు. హైదరాబాద్ జంట నగరాల్లో హోం డెలివరీ సర్వీస్ ప్రారంభించినట్లు చెప్పారు. వినియోగదారులు ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



కొడంగల్: ఓటరు జాతీయ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఊరేగింపుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించనున్నట్లు చెప్పారు. 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. ప్రజలందరూ స్వేచ్ఛగా.. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. కులం, వర్ణం, వర్గం, ధనిక, పేద అనే తేడా లేకుండా నిర్భయంగా ఓటు వేయడానికి ప్రజలను జాగృతం చేసే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. యువజనులు ఊరేగింపులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అడిషనల్ కలెక్టర్ సుధీర్



అనంతగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నా రు. శుక్రవారం వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అన్నారు. జైదుపల్లిలో ఎంపీఓ దయానంద్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి పూర్ణిమ, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కమిటీ ఎన్నికకు దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగుల శాఖలో పని చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి కేటగిరీ కింద (ఐదుగురు సభ్యులు దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థల నుంచి) దివ్యాంగుల సమస్యలు, సేవల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలకు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అందులో ఒకరు మహిళ అయి ఉండాలని, ఒకరు షెడ్యూల్ కులం వర్గానికి చెందిన అభ్యర్థి లేక షెడ్యూల్ తెగలు వర్గానికి చెందిన వారు అయి ఉండాలన్నారు. రెండవ కేటగిరీ కింద(ఐదుగురు సభ్యులు దివ్యాంగుల్లో పరిజ్ఞానం, అనుభవం కలిగిన వారి నుంచి) దివ్యాంగుల సమస్యలపై అవగాహన కలిగి సేవా దృక్పథం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరిలో మహిళ, ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన అభ్యర్థి అయి ఉండాలన్నారు.

ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో..

కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



కొడంగల్: కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం పని చేసిందని చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఐదేళ్లుగా మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేశాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ప్రాంత అభివృద్ధికి రూ.437 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పురోగతిలో ఉద్యోగుల సహకారం ఎంతో ఉందన్నారు. సీఎం సహకారంతో కొడంగల్ ఆదర్శ నియోజకవర్గంగా మారుతుందన్నారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, శానిటేషన్ తదితర వాటికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రై నేజీ, రోడ్లు తదితర పనులకు రూ.337 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పాత కొడంగల్ ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ.45 కోట్లు, మినీ స్టేడియం నిర్మాణానికి రూ.3 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ. 52కోట్లకు అనుమతి వచ్చిందన్నారు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. మొత్తం రూ.437 కోట్ల వ్యయంతో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పురపాలికలో విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. పార్కులు, వైకుంఠధామాల అభివృద్ధి నిధులు కేటాయించినట్లు చెప్పారు.

మున్సిపల్ పాలకవర్గాల గడువు ఈ నెల 26తో ముగియనుంది. మౌలిక సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా చైర్మన్లు ఇంతకాలం పనులు చేపట్టారు. తమ పదవీ కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయని, ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని తెలిపారు. అభివృద్ధిలో అధికారుల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రజల సహకారంతోనే పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. 'సాక్షి'తో తమ అనుభవాలను పంచుకున్నారు..

సాక్షి ప్రత్యేకం

సమష్టి కృషితోనే పరిగి అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



పరిగి: పరిగి మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దామని చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ తెలిపారు. పాలవర్గం పదవీకాలం పూర్తి కావస్తున్న సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పదవీ కాలంలో దాదాపు రూ.48 కోట్లతో వివిధ అభివృద్ధి ప నులు సమర్థవంతంగా పూర్తి చేశాం. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పడగానే మొట్టమొదటి పాలకవర్గం పరిగిని అన్ని విధాలా అభివృద్ధి చేసింది. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశాం. మున్సిపాలిటీ ఏర్పాటైన సమయంలో అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని దశలవారీగా పరిష్కరిస్తూ వచ్చాం. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు వేశాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కులు ఏర్పాటు చేశాం. ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనాకే పోయింది. పట్టణ ప్రజల కోసం సులాబ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశాం. ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. అభివృద్ధికి కౌన్సిలర్లు సమష్టిగా కృషి చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని విధాలా సహకరించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తులు

96,423

ముగిసిన ప్రజాపాలన గ్రామ సభలు

- 585 జీపీలు, 97 మున్సిపల్ వార్డుల్లో కార్యక్రమాలు
- నాలుగు పథకాలకు అర్హుల జాబితా
- పేర్లు లేనివారి నుంచి అర్జీల స్వీకరణ
- ప్రజల సమక్షంలో జాబితాకు ఆమోదం

వికారాబాద్: నాలుగు రోజులుగా గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లాలోని 585 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లోని 97 వార్డుల్లో సభలు పూర్తి చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాలను గ్రామాలు, వార్డుల వారీగా చదివి ప్రజల సమక్షంలో ఆమోదింపజేశారు. అయితే గతంలో పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నా అర్హుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని పలు చోట్ల ప్రజలు అధికారులను నిలదీశారు. నాలుగు పథకాల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువ అర్జీలు వచ్చాయి.

నిరసనలు.. నిలదీతలు..

ప్రజాపాలన గ్రామ సభల్లో అధికారులు, అధికార పార్టీ నేతలు అనేక చోట్ల నిరసనలు, నిలదీతలు ఎదుర్కోవాల్సి వచ్చింది. తమ పేర్లు జాబితాలో రాకపోవటంపై వారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎక్కువ దరఖాస్తులను అర్హుల జాబితాలో చేర్చినప్పటికీ మొదటి విడతలో ఎవరికి ఇస్తారనే విషయంలో ఉత్కంఠ నెలకొంది. రేషన్ కార్డుల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేర్లు లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు అంటున్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించి జాప్యం చేసిన విషయం తెలిసిందే.. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా ఇదే తంతు కొనసాగుతుందా అనే అనుమానం ప్రజల్లో నెలకొంది.



ధారూరు మండలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఆ నాలుగు పథకాలకు..

అధికారులు గ్రామసభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు లేనివారు పథకాల కోసం భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాల కోసం వేల మంది అర్జీలు ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 26,312 దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 7,582దరఖాస్తులు, రైతు భరోసాకు 3,754 దరఖాస్తులు సమర్పించారు. రేషన్ కార్డుల కోసం అన్నింటి కంటే ఎక్కువగా 58,784 అర్జీలు వచ్చారు. ఈ నాలుగు పథకాల కోసం 96,423 దరఖాస్తులు వచ్చాయి.

చివరి సమావేశం



తాండూరు మున్సిపల్ కార్యాలయం

- నేటి కౌన్సిల్ మీటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- అసెంబ్లీ తరహాలో హాల్ ఆధునీకరణ

తాండూరు: తాండూరు మున్సిపల్ పాలకవర్గ చివరి సమావేశానికి ముహూర్తం ఖరారైంది. నేడు(శనివారం) కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు మూడు నెలలుగా సమావేశం నిర్వహించాలని కౌన్సిలర్ల నుంచి ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. చైర్‌పర్సన్, కమిషనర్ చాంబర్ తోపాటు కౌన్సిల్ హాల్‌ను రూ.33 లక్షలతో ఆధునీకరణ పనులు జరుగుతుండటంతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ నెల మొదటి వారంలో సమావేశం నిర్వహించేందుకు కౌన్సిల్ ఫ్లోర్‌లీడర్‌లతో చైర్‌పర్సన్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో 36 వార్డులు ఉండగా ఒక్కో వార్డులో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో నిధులు లేవని భారీ మొత్తంలో కేటాయించలేమంటూ అధికారులు అనడంతో అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో చివరి సమావేశం పెట్టడం సాధ్యం కాదని అధికారులు చేతులేత్తేశారు. చివరి కౌన్సిలర్ సమావేశం కోసం మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్‌లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సంప్రదించారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మున్సిపల్ అధికారులతో మాట్లాడి శనివారం సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వా ర్డుకు రూ.5 లక్షల చొప్పున అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తు ఎజెండాను సిద్ధం చేయా లని కమిషనర్ విక్రంసింహారెడ్డికి సూచించారు. శనివారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే అసెంబ్లీ తరహాలో కొత్త హంగులతో నిర్మించిన కౌన్సిల్ హాల్ కౌన్సిల్ చివరి సమావేశానికి ముస్తాబైంది.



వైద్య సిబ్బందికి కిట్లు అందజేస్తున్న ఉమాహారతి

ప్రాథమిక దశలోనే గుర్తించాలి

అనంతగిరి: సున్నా నుంచి ఆరేళ్ల వయసులోపు పిల్లల్లో వచ్చే లోపాలు, వైకల్యాన్ని ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం అందిస్తే మంచి ఫలితం ఉంటుందని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజబుటిటీస్ సికింద్రాబాద్ వారి సమన్వయంతో శుక్రవారం వికారాబాద్ డివిజన్ పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక మహావీర్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరవణ మాట్లాడుతూ.. 0 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలలో పెరుగుదల లోపం, వైకల్యాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. వారికి సరైన వైద్యం అందిస్తే వైకల్యాన్ని జయించవ్చని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలు విధి నిర్వహణలో ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు ఎర్లీ ఇంటర్వెన్షన్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు డాక్టర్ రుశికేష్ దేశ్‌పాండే, గౌతమ్ రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు రవీంద్రయాదవ్, ప్రవీణ్, శ్రీనివాసులు, చండీశ్వరి, రజిత తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ చెయ్.. పనితీరు చెప్పేయ్

- పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి క్యూఆర్ కోడ్

పరిగి: పోలీస్ శాఖలో పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు డయల్ 100, షీటీం, సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలకు మరింత చేరువ అవుతోంది. తాజాగా క్యూఆర్ కోడ్ విధానానికి శ్రీకారం చుట్టింది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత విచారణలో ఇబ్బందులు తలెత్తితే ఎవరికి చెప్పుకోవాలో చాలా మందికి తెలియదు. అందుకే ప్రభుత్వం ప్రతి స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వ్యక్తికి ఎదురైన అనుభవాలు.. పోలీసుల పనితీరుపై అభిప్రాయం చెప్పేందుకు ప్రభుత్వం ప్రజలకు ఈ అవకాశం కల్పించింది.

వినియోగం ఇలా..

ప్రభుత్వం పోలీస్‌శాఖలో అందుబాటులోకి తెచ్చిన క్యూఆర్ కోడ్‌ను ఫోన్(స్మార్ట్ ఫోన్)లో స్కాన్ చేసి అందులో సూచించిన భాషను ఎంచుకోవాలి. తర్వాత పేరు, లింగం, మొబైల్ నంబర్, ఈ మెయిల్ ఐడీని నమోదు చేయాల్సి ఉంటుంది. అందులో పొందుపరిచిన ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ చలాన్, పాస్‌పోర్టు, ఇతర వాటిలో ఏది అవసరమో దాన్ని ఎంచుకోవాలి. ఎంచుకున్న అంశానికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఏ రోజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.. దానిపై అధికారులు ఏ విధంగా స్పందించారు. ఫిర్యాదు చేస్తే నంబర్ వచ్చిందా అనే విషయాలను పూర్తిగా తెలపాలి. ఠాణాకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు అక్కడి సిబ్బంది, అధికారులు వ్యవహరించిన తీరును సైతం అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా పోలీసు అధికారుల పనితీరుపై రేటింగ్ కూడా ఇచ్చేందుకు వీలుంది.

ఫిర్యాదులు నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి

జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఠాణాకు వెళ్లిన వారికి అక్కడ ఎదురయ్యే అనుభవాలను ఇందులో నమోదు చేస్తే నేరుగా రాష్ట్రస్థాయి అధికారులకు చేరుతుంది. వారు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారు. అంతేకాకుండా నిజాయితీగా విధులు నిర్వహించే వారిని గుర్తిస్తారు.



పరిగి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

విధుల్లో పారదర్శకత



పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. ఈ పద్ధతి ద్వారా విధుల్లో పారదర్శకత ఏర్పడుతుంది. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు రాష్ట్రస్థాయి అధికారులకు తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌ను అన్ని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్, పరిగి డీఎస్పీ



దుద్యాల్ గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్



రోటిబండతండాలో పోలీసు బందోబస్తు

పోలీస్ పహారాలో గ్రామ సభలు

దుద్యాల్: రోటిబండతండా, దుద్యాల్, సంత్రకుంటతండా, హస్నాబాద్, హంసంపల్లిలో శుక్రవారం పోలీసు బందోబస్తు నడుమ గ్రామ సభలు నిర్వహించారు. సుమారు 500 మంది జనాభా కూడా లేని రోటిబండతండాలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌రెడ్డి, ట్రైనీ ఎస్ఐలు రాహుల్, మోహన్‌తో పాటు మరో 15 మంది కానిస్టేబుళ్లు సభను పర్యవేక్షించడం చర్చనీయాంశమైంది. లగచర్ల ఘటన కేసులో ఈ గ్రామానికి చెందిన ఐదుగురు జైలుకు వెళ్లి వచ్చిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంపీఓ మహేశ్ మాట్లాడుతూ.. ప్రజలందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కృష్ణవేణి, సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, మెరుగు వెంకటయ్య, ఖాలీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం రాక

మహేశ్వరం: మండల పరిధిలో అభివృద్ధి పనులను ప్రారంభించడానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం రానున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమనగంటి ప్రశాంత్‌రెడ్డి, నేనావత్ రాజు నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మహేశ్వరం మండల కేంద్రానికి మధ్యాహ్నం 12.30 గంటలకు మంత్రి రానున్నారని తెలిపారు.నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్య లో హాజరై విజయవంతం చేయాలన్నారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: మండల పరిధిలో అభివృద్ధి పనులను ప్రారంభించడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం రానున్నారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరు చౌరస్తాలో మధ్యాహ్నం 1.30 గంటలకు భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ కార్యాలయ భవనం ప్రారంభోత్సవం

మోమిన్‌పేట: మండల కేంద్రంలో ప్రాథమిక సహకార పరపతి సంఘం నూతన కార్యాలయ భవనం శనివారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. రూ.1.40కోట్ల నిధులతో నిర్మించిన కార్యాలయ నూతన భవనం, గోదాంను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

అర్హులకు అన్యాయం జరగదు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చించల్‌పేట గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: అధికారులు అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా అప్రమత్తతో పనిచేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం ఆయన చించల్‌పేటలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. ఈ నెల 26నుంచి నాలుగు పథకాలు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జైరాం, పీఏసీఎస్ వైస్ చైరమన్ నర్సింహారెడ్డి, ఎంపీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

అనంతగిరి: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన 2025 క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాన్యనాయక్, ప్రకాశ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయసేవాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి డీబీ శీతల్



మట్లాడుతున్న జడ్జి డీబీ శీతల్

అనంతగిరి: బాలికలు ఉన్నతంగా రాణించాలంటే చదువుతోనే సాధ్యమని న్యాయసేవాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వికారాబాద్ కేజీబీవీలో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీబీ శీతల్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేషం, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్ని దరఖాస్తులు ఇవ్వాలి

గ్రామ సభల్లో నిరసన జ్వాలలు

- అధికారులను నిలదీసిన ప్రజలు
- శాంతియుతంగా సమాధానమిచ్చిన అధికారులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు శుక్రవారంతో ముగిసాయి. జనవరి 26న ప్రారంభించనున్న నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ సభలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో జాబితాలో పేరులేని వారు అధికారులను ప్రశ్నించారు. అనర్హులకు పెద్దపీట వేశారని ఆరోపించారు. చివరకు దరఖాస్తులు చేసుకుని వెళ్లిపోయారు.

'లిస్టులో అనర్హులే ఎక్కువ'

దౌల్తాబాద్: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. అధికారులు అర్హుల జాబితా చదువుతుండగా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసాలో అనర్హులు ఎక్కువగా ఉన్నారంటూ బీఆర్ఎస్ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. జాబితాలో పేరు లేని వారు మరో మారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ రజనికాంత్, ఏఈఓ వైశాలి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ తదితరులున్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

ఇది జాబితా మాత్రమే.. ఫైనల్ కాదు

తాండూరు రూరల్: గ్రామాల్లో ప్రజల నుంచి నిరసనలు ఎదురవుతుండడంతో అధికారులు, నాయకులు ఇందిరమ్మ ఇళ్ల జాబితా చదివి వినిపించలేదు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఒక్కో గ్రామానికి పది నుంచి 15 ఇళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంటుంది. ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు రావడంతో అధికారులు, నాయకులు అర్హుల జాబితా చదివి చేతులు దులుపుకొన్నారు. సంగెం కలాన్ గ్రామంలో 308, అంతారంలో 370 మంది అర్హులున్నట్లు పేర్లను చదివి లిస్ట్ ఫైనల్ కాలేదని చెప్పారు. కాగా గ్రామ సభల పేరిట ఏర్పాటు చేసిన సమావేశాల్లో క్షేత్ర స్థాయిలో పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.



తాండూరు రూరల్: అంతారంలో నాయకుల ఆందోళన

సభలతో ఒరిగేది ఏముంది?

నవాబుపేట: ప్రజాపాలన గ్రామసభలతో ఒరిగేదేమీ లేదని ప్రజలు అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో అధికారులు ఎజెండా చదువుతుండగా.. గ్రామస్తులు ఒక్కసారిగా ఈ సభలతో వచ్చేది పోయేదేమీలేదని మండిపడ్డారు. అధికారులకు, ప్రజలకు టైం వేస్ట్ తప్ప ఇప్పటి వరకు ఏ సమస్య పరిష్కరించారో చెప్పాలని ప్రశ్నించారు. పథకాలన్నీ పార్టీలకు తొత్తులుగా ఉన్నవారికే అందుతున్నాయని.. పేదలకు ఎవరూ ఏం చేయరని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు అర్హులదరికీ పథకాలు వస్తాయని .. పేరు లేని పేదలుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, ఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం

వార్డుసభను అడ్డుకునేందుకు యత్నం

- చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్‌పై విమర్శలు
- కౌన్సిలర్ ఆసిఫ్‌ను కట్టడి చేసిన పోలీసులు

తాండూరు: ప్రజాపాలన వార్డు సభకు ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ రాలేదంటూ 35 వార్డు కౌన్సిలర్ మహ్మద్ ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వార్డులో కొనసాగుతున్న సభను ముట్టడించేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. శుక్రవారం తాండూరు మున్సిపాలిటీలో చివరిరోజు వార్డు సభలు నిర్వహించారు. 35వ వార్డుకు సంబంధించిన సభను పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్ ఆసిఫ్ హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపరిమళ్ రాకపోవడంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ రాకపోవడంతో తామే 33వ వార్డులో నిర్వహిస్తున్న సభకు వెళ్లేందుకు కౌన్సిలర్ ప్రజలను సిద్ధం చేశారు. దీంతో పోలీసులు అప్రమత్తమై బీఆర్ఎస్ కౌన్సిలర్లను, వార్డు ప్రజలను బయటకు వెళ్లకుండా కట్టడి చేశారు. పాలకవర్గం ఏర్పాటైన 2020, జనవరి నుంచి చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపరిమళ్‌కు, కౌన్సిలర్ ఆసిఫ్‌ల మధ్య తరచూ వివాదం నెలకొంటూ వచ్చింది. గతంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌ను చైర్‌పర్సన్.. చోర్‌మెన్ అంటూ కౌన్సిల్ సమావేశంలో నినాదాలు చేశారు. ఈ సంఘటనతో కావాలనే గొడవ పెట్టుకుంటున్నాడని, వార్డు కౌన్సిలర్ ఉన్న వార్డుకు ఎమ్మెల్యేతో పాటు చైర్‌పర్సన్ దూరంగా ఉన్నారంటూ తాండూరు పట్టణంలో చర్చనీయాంశంగా ఉంది.



వార్డుసభను అడ్డుకునేందుకు వెళ్తున్న కౌన్సిలర్ ఆసిఫ్‌ను కట్టడి చేస్తున్న పోలీసులు

'ఏకలవ్య'లో అలహాబాద్ హైకోర్టు జడ్జి

తాండూరు రూరల్: ఆధునిక సాంకేతిక యుగంలో ఇప్పటికి కూడా ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం చేయడం అభినందనీయమని అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ వినోద్ దివాకర్ అన్నారు. తాండూరు మండలం జినుగుర్తి గ్రామ శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. సాందీపనీ గురుకుల పాఠశాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంఘ్ ప్రచారక్ భాగయ్య, ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి రామచంద్రమూర్తి ఉన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ వినోద్ దివాకర్

బంగారు దుకాణాల్లో వెండి పట్టీలు చోరీ

ఇద్దరు మహిళల అరెస్ట్



నగల దుకాణంలో చోరీకి పాల్పడుతున్న మహిళలు

తాండూరు టౌన్: నగలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఇద్దరు మహిళలు వెండి పట్టీలు అపహరించారు. వారిని పట్టుకున్న దుకాణ యజమాని పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మొగిలిగిద్దకు చెందిన అనిత, చిన్న నందిగామకు చెందిన మమత పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఓ నగల దుకాణానికి వెళ్లి వెండి పట్టీలు చూపమన్నారు. ఈ క్రమంలో సుమారు ఐదు తులాల వెండి పట్టీలు చోరీ చేసి అక్కడ నుంచి ఉడాయించారు. అనంతరం వారు మధ్యాహ్నం గాంధీ చౌక్‌లో ఉన్న వేంకటేశ్వర బంగారు దుకాణానికి వెళ్లి వెండి పట్టీలు చూస్తూ 20 తులాల పట్టీలు దొంగిలించారు. వారు వెళ్లిపోయాక చూసుకున్న యజమాని రోడ్డుపైకి వెళ్లి వారిని నిలదీయడంతో పట్టీలు ఇచ్చేశారు. ఇదే విషయం దుకాణ యజమాని బంగారు వ్యాపారుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. అప్రమత్తమైన మరో దుకాణ యజమాని సాయంత్రం ఇద్దరు మహిళలు తన వద్దకు వచ్చి వెండి పట్టీలు అడిగారని గ్రహించి లెక్క చూసుకోగా సుమారు 5 తులాల వెండి పట్టీలు కనపడలేదు. మహిళల కోసం బస్టాండుకు వెళ్లి వెతకగా అక్కడ వారిని పట్టుకుని వారి వద్ద నుంచి వెండి పట్టీలు తీసుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గంధోత్సవంలో పాల్గొన్న రాఘవేందర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

ఆమనగల్లు: పట్టణం సమీపంలోని బైరాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సైదులు దర్గాలో శుక్రవారం జరిగిన గంధోత్సవంలో టాస్క్, సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. సైదులు దర్గా వద్ద సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఫాతేహా సమర్పించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సైదులు దర్గా ఉత్సవాలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కుల మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి పండుగలు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని దర్గా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట

- ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



బషీరాబాద్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.7లక్షల కోట్ల అప్పు మిగిల్చిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని 33వ వార్డులో ప్రజా పాలన వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీని నాలుగేళ్లలో అధ్వాన్నంగా మార్చారన్నారు. తాను ఎమ్మెల్యే అయిన ఏడాదిలోనే మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. మున్సిపల్ పరిధిలో యూజీడీ అభివృద్ధి పనులకు రూ.480 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశామన్నారు. పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. వరద ముంపు నుంచి ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు రూ.16 కోట్లతో చిలుక వాగు ప్రక్షాళన పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన పది నెలల వ్యవధిలోనే తాండూరు–హైదరాబాద్ రోడ్డు మార్గంతో పాటు నలువైపులా ఉన్న రోడ్లకు నిధులు మంజూరు చేయించామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు. అంతకు ముందు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నతోపాటు కౌన్సిలర్‌లు ప్రసంగించారు. అనంతరం వార్డు ప్రజల నుంచి సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రవీణ్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, విజయాదేవి, భీంసింగ్‌రాథోడ్, అబ్దుల్ రజాక్, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నర్సింహులు, జుబేర్‌లాల, సీనియర్ నాయకులు అబ్దుల్ రవూఫ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'సంక్షేమం'

బషీరాబాద్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నవల్గా, కొర్విచెడ్ గ్రామ సభల్లో ఎమ్మెల్యే ప్రసంగించారు. జాబ్‌కార్డులతో పని లేకుండా భూమిలేని ప్రతీ కూలీకి 26న ఇందిరమ్మ ఆత్మీయభరోసా అందిస్తామన్నారు. పథకాలు అందవని దిగులు చెందొద్దని ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరించి మాఫీ చేయిస్తామన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. గ్రామసభలో సంక్షేమ పథకాల జాబితాలో పేర్లు లేని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మరోసారి దరఖాస్తు చేసుకుంటే కొత్తకార్డులు వస్తాయని చెప్పారు.

బషీరాబాద్‌కు నాలుగు వరసల రహదారి

యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ బషీరాబాద్ మీదుగా మైల్వార్ వరకు రూ.150కోట్లతో నాలుగు వరసల రహదారి నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. బషీరాబాద్ నుంచి జీవన్గీ మీదుగా కరణ్‌కోట్ వరకు రూ.30కోట్లతో రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. గ్రామసభల్లో కొందరు అర్జీదారులు తమ పేర్లు జాబితాలోలేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు రాకేష్‌మహరాజ్, చందర్, శంకరప్ప, శంకర్‌రెడ్డి, సతీశ్, తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

తాండూరు రూరల్: తల్లీకూతరు అదృశ్యమైన ఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎల్మకన్నె గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఎల్మకన్నెకు చెందిన శిరీష, శ్రీనివాస్ దంపతులకు ఓ కూతరు ఉంది. ఈ నెల 8న శిరిష ఇంటి నుంచి పాపతో కలిసి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా లభించలేదు. దీంతో శుక్రవారం భర్త శ్రీనివాస్ కరన్‌కోట్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎవరైనా గుర్తించిన వారుంటే ఫోన్ నంబర్ 8712670052లో సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.



కూతురుతో తల్లితో శిరీష(ఫైల్)

పోలీసు విధులకు ఆటంకం

ఇద్దరికి రిమాండ్

తాండూరు టౌన్: కానిస్టేబుళ్ల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు యువకులను పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ సంతోశ్ కుమార్ తెలిపిన ప్రకారం.. గురువారం మధ్యాహ్నం స్థానిక విలియం మూన్ మైదనంలో రెండు గ్రూపులకు చెందిన వారు గొడవ పడుతున్నారని డయల్ 100కు సమాచారం అందింది. ఈ మేరకు కానిస్టేబుళ్లు సత్తార్, సాయిరాం అక్కడకు వెళ్లి వారికి సర్ది చెబుతుండగా ఇందిరానగర్‌కు చెదిన బాతుల శ్రీకాంత్, బాతుల శ్రీధర్ పోలీసులపట్ల దురుసుగా వ్యవహరించి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వీరిద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. రెండు గ్రూపులకు చెందిన 15 మందితో పాటుగా మరికొందరు యువకులపై కేసు నమోదు చేశామన్నారు.

జెండా మోసినా.. మొండి చేయి

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసిన నాకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొండి చేయి చూపారని ఓ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం మండల పరిధిలోని అంతారంలో గ్రామసభ నిర్వహించారు. ఇందులో 370 మంది అర్హుల జాబితా చదవగా అందులో గ్రామానికి చెందిన దప్పు రాజు పేరు లేదు. ప్రైవేట్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న తాను ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండా మోశానని ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే తన పేరు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించాడు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.



దప్పు రాజు

సాంకేతిక విద్య.. దేశాభివృద్ధికి దోహదపడాలి

ఇబ్రహీంపట్నం రూరల్: సాంకేతిక విద్య సమాజ, దేశాభివృద్ధికి దోహదపడాలని సాంకేతిక విద్యా మండలి చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళ్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు కొనసాగనున్న 'సస్టెయినబుల్ మెటీరియల్స్, టెక్నాలజీస్ అప్లికేషన్స్ ఇన్ ఇంజనీరింగ్' సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, కళాశాల చైర్మన్ రాఘవ చెరబుడ్డి, ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటిని కూల్చేస్తామని బెదిరింపులు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నందిగామ: ఇంటిని కూల్చివేస్తామని కొందరు వేధించడంతో ఓ యజమాని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సప్పగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, నందిగామ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంకం కుమార్(32) ఇటీవల గ్రామంలో ఇల్లు నిర్మించుకున్నారు. నిర్మాణ దశ నుంచే ఆ ఇల్లు తమ పట్టా పొలంలో ఉందని అదే గ్రామానికి చెందిన మంగళి నందమయ్య, రాజు, కుమార్, లింగం, రవి, అనిల్‌లు నిత్యం బెదిరించేవారు. ఈ క్రమంలోనే అంకం కుమార్ గృహ ప్రవేశం చేశారు. ఈ మధ్య వేధింపులు అధికమవ్వడంతో గురువారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. తన భర్త చావుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య తేజస్విని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో సైతం మంగళి నందమయ్యతో పాటు ఆయన కుమారులు వేరే చోట నిర్మించుకున్న ఇంటిని కూల్చివేశారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

సీఎంకు స్వాగతం.. సన్మానం

షాద్‌నగర్/అబ్దుల్లాపూర్‌మెట్: పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం శంషాబాద్ విమానాశ్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి స్వాగతం పలికారు. విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకొని తిరిగి వచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు.





సీఎం రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చిత్రంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు